GOVERNMENT DEGREE COLLEGE-KAGAZNAGAR

*DEPARTMENT OF TELUGU*

# STUDENT STUDY PROJECT (2020-21)

TOPIC:సాంస్కృతిక ప్రదర్శన కళలు- సంగ్రహావలోకనం

STUDENT NAMES

1.SYED AFJAL -B.A II YR

2.B.MAYURI -B.A II YR

3.J. SANDHYA-BZC IIYR

4.Ch.JYOTSNA-BZC IIYR

GUIDE:D.LAXMINARASIMHAM

## సాంస్కృతిక ప్రదర్శన కళలు-సగ్రహావలోకనం (Glimpses of Different cultural art forms in India)

సంస్కృతి అనే పదానికి ఆంగ్లంలో సమానార్థక పదం కల్చర్ (Culture) దీనికి మూలం లాటిన్ భాషలోని 'కల్చుర' అనే పదం. 'కల్చుర' అనగా వ్యవసాయం చేయడం, పండించడం అనే అర్థాలు ఉన్నాయి. స్థూలంగా సంస్కృతి అనగా ఒక సమాజంలో తరతరాలుగా వస్తున్న కళలు, ఆచారాలు, సాంప్రదాయాలు, విశ్వాసాల యొక్క సమ్మేళనంగా చెప్పుకోవచ్చు. అనగా ఒక జాతి జీవన విధానాన్ని సంస్కృతిగా మనం అర్థం చేసుకోవాల్సి ఉంటుంది. భారతీయ సంస్కృతి ఒక విలక్షణ సంస్కృతి. దీనికి కారణం భారతదేశం వివిధ జాతుల ప్రదర్శన శాల, వివిధ మతాల, కులాల, తెగల సమాహారం కావడం వల్ల ఇక్కడ ఒక ప్రత్యేక సాంస్కృతిక జీవనాన్ని మనం గమనించవచ్చు.

భారతదేశంలో విభిన్న సాంస్కృతిక కళారూపాలు మనకు కనిపిస్తాయి శ్రమతో అలిసిన శ్రామికుడికి కళ ఒక అలౌకిక ఆనందాన్ని కలిగిస్తుంది. మనస్సును రంజింపజేసి మనిషికి ఆనందానుభూతుల్ని కలిగించి రసానంద పారవశ్యం కలిగించే సాంస్కృతిక కళారూపాలను స్థూలంగా పరిశీలించినప్పుడు మనకు భారతీయ సంస్కృతిలో దాగి ఉన్న ప్రత్యేకత గోచరిస్తుంది. ఇక్కడ విభిన్న కళారూపాలను, కళాప్రదర్శన విశేషాలను స్థూలంగా పరిచయం చేస్తున్నాను.

**1) బుర్రకథ:** ప్రాచీన వీరగాథలను, సామాజికాంశాలను ఈ కళారూపం హృదయానికి హత్తుకుపోయేలా వివరిస్తుంది. సంగీతం, నృత్యం, నాటకం అంశాలు కలగలసి ప్రదర్శించే ఈ కళారూపం నేటికి గ్రామీణ ప్రాంతాలలో ఆదరణను కలిగి ఉంది. కథకులు నవరసాలను ఒంటిచేత్తో పలికిస్తు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేయడం ఇందులోని ప్రత్యేకత. బుర్రకథ పేరు చెబితేనే గుర్తుకువచ్చే నాజర్ ఈ కళాప్రదర్శనకు అంతర్జాతీయ స్థాయిని కల్పించాడు. పల్నాటియుద్ధం, బొబ్బిలియుద్ధం మొదలగు వీరగాథలను తన బుర్రకథ ప్రదర్శన ద్వారా ప్రదర్శించి తెలుగువారి హృదయాలలో చెరగని ముద్రవేశాడు. బురక్రథ ఒక జానపద కళ. సాధారణంగా కథకుడు అతనికి ఇద్దరు సహాయకులుగా ఉంటు ప్రదర్శించే ఈ కళ అనేక చారిత్రక, సాంస్కృతిక, ఐతిహాసిక అంశాలను ప్రజలకు అందిస్తున్నది.

**2) యక్షగానం:** పౌరాణిక ఇతివృత్తాలను ప్రదర్శించే యక్షగాన కళారూపం నేటికి విస్తృత ప్రజాదరణను కలిగి ఉంది. పద్యాలు, పాటలు, కీర్తనలు మేళవించి, సంగీత వాయిద్యాలతో ప్రదర్శించే ఈ కళాప్రదర్శనలో పౌరాణిక, చారిత్రక గాథలను భవిష్యత్ తరాలకు అందించే రంగస్థల ప్రదర్శనే యక్షగాన ప్రక్రియ.

**3) హరిదాసు:** తెలుగువారి సాంస్కృతిక కళల్లో ఇది ఒక ప్రత్యేక కళ. ఒక చేతిలో చిరుతలు, మరోచేతిలో తంబూరా, తలమీద పాత్ర ధరించి తనను తాను నియంత్రించుకుంటు హరికీర్తనలు ఆలపిస్తూ సంక్రాంతి సందర్భంగా తెలుగులోగిళ్ళలో సందడిచేసే ఈ కళావిదూషి నిజంగా అపర నారధుడే. ఎర్రని పంచెకట్టు, నుదుటిపై విష్ణునామాలు ధరించి "హరిలో రంగ హరి" అంటూ కదిలే అతని ఆహార్యం ఒక ప్రత్యేకతను కలిగి ఉంటుంది. ఇంటింటా తిరుగుతూ భిక్షను స్వీకరిస్తు కీర్తనలు ఆలపిస్తు మరుగున పడ్డ మన సంస్కృతిని గుర్తుచేస్తూ సాగే ఈ ప్రదర్శన నేడు కొంత మరుగున పడటం బాధాకరం.

**4) కోలాటం:** పొద్దంతా పొలం పనులు చేసి రాత్రి సమయంలో ఒక్కచోట చేరి అలసిన దేహాలకు కాస్త హాయినందిస్తు కోలల ద్వారా కొంతమంది ప్రదర్శించే ఈ నృత్య ప్రదర్శనలో గ్రామీణ జీవన సౌందర్యం తొణికిసలాడుతుంది. ఇందులో స్త్రీలు లేదా పురుషులు ఒక బృందంగా ఏర్పడి లయబద్ధంగా కదులుతు పాటలు ఆలపిస్తూ సాగే ఈ కళాప్రదర్శన మన సంస్కృతిలో ఒక భాగంగా తరతరాల నుండి ప్రదర్శించబడుచున్నది.

**5) బతుకమ్మ:** తెలంగాణ ప్రాంతంలో ఆశ్వయుజ మాసంలో ప్రదర్శించే ఈ కళారూపం అతిపెద్ద సాంస్కృతిక ఉత్సవం. వివిధ రకాల పూలను సేకరించి గుండ్రంగా పేర్చి గౌరమ్మను నిలిపి స్త్రీలంతా రాత్రి సమయంలో ఒక్కచోట చేరి గుండ్రంగా తిరుగుతు చప్పట్లు కొడుతు పాటలు పాడుతూ తొమ్మిది రోజులపాటు జరిగే ఈ ఉత్సవాలు జాతీయ, అంతర్జాతీయ కళాప్రదర్శనలో చోటు సంపాదించాయి. గ్రామీణ సంస్కృతికి, జీవన విధానానికి నిలువుటద్దం బతుకమ్మ పండుగ. చిన్న, పెద్ద తేడా లేకుండా స్త్రీలంతా తొమ్మిది రోజులపాటు ఈ ఉత్సవాలలో పాల్గొని చద్దుల బతుకమ్మలో 9వ రోజున గౌరమ్మను సాగనంపుతూ ఈ ఉత్సవాలను ముగిస్తారు. ఈ సందర్భంగా అనేక పాటలు మౌఖిక సాహిత్యం ద్వారానే వ్యాప్తిచెందుతు సమాజపు సంస్కృతిని ప్రతిబింబిస్తున్నాయి. తంగెడు, గునుగు, గుమ్మడి, కట్ల, తామర పువ్వులను సేకరించి బతుకమ్మలను తయారు చేసి అనేక పాటలు ఆలపిస్తూ కొనసాగే ఈ సాంస్కృతిక కళారూపం తెలుగు వారి ప్రత్యేక కళాప్రదర్శనగా మనం చెప్పుకోవచ్చు.

**6) బుట్టబొమ్మలు:** ఆంధ్రప్రాంతంలో తిరునాళ్ళలో, పెళ్ళి ఉత్సవాలలో, దేవుని కళ్యాణ ఉత్సవాలలో ఈ బుట్టబొమ్మల ప్రదర్శన ప్రజలకు, చూపరులకు వినోదాన్ని కలిగిస్తుంది. బుట్టబొమ్మలు ఎత్తుగా ఉండి ప్రజల మధ్య తిరుగుతు అందరిని ఆకర్షిస్తూ ఉంటాయి. బొమ్మల పై భాగమంతా బొమ్మ ఆకారంగా ఉండి లోపలిభాగం ఖాళీగా ఉంటుంది. బొమ్మయొక్క కళ్ళభాగం, నోటి దగ్గరా రంధ్రాలు ఉంటాయి. బుట్టబొమ్మలు ప్రదర్శించే ఆటగాడు ఈ బొమ్మలోపలికి దూరి నృత్యం చేయడం ద్వారా ఇది వీక్షించే వారికి కేవలం బొమ్మ మాత్రమే కదులుతున్న అనుభూతి కలుగుతుంది.

**7) గుస్సాడి:** గిరిజన నృత్యాలలో ఇది ప్రముఖంగా ఆదిలాబాద్ ప్రాంతంలోని ఆదిమ గిరిజనులు ప్రదర్శించే ఒక ప్రత్యేక నృత్య ప్రదర్శన. ఆదిలాబాద్ జిల్లాలోని రాజ్‌గోండులు దీపావళి పండుగ సందర్భంగా ఈ కళను గ్రామగ్రామాన తిరుగుతూ ప్రదర్శిస్తారు. నెమలి పింఛాలతో తయారుచేసిన తలపాగ, మెడలో గవ్వల హారాలు, గడ్డాలు, మీసాలు ప్రత్యేకంగా అమర్చుకొని గజ్జెలు ధరించి చేతిలో కర్రను పట్టుకొని బృందంగా ఏర్పడి ప్రదర్శించే ఈ కళాప్రదర్శనలో గిరిజన సంస్కృతి కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది.

**8) థింసా:** విశాఖపట్టణం ఏజెన్సి ప్రాంతంలో గిరిజనులు ప్రదర్శించే సాంప్రదాయిక జానపద కళానృత్యాలలో థింసా విశేష జనాదరణ కలిగిన గిరిజన నృత్యం. స్త్రీ, పురుష బేధం లేకుండా అన్ని వయసులవారు ఈ నృత్య ప్రదర్శనలో పాల్గొనడం విశేషం. పండగలు, వివాహాల సందర్భంగా ప్రదర్శించే థింసా నృత్యం గిరిజన సంస్కృతికి నిలువుటద్దం.

**9) పగటివేషం:** ఈ ప్రదర్శన కేవలం పగటి సమయంలో మాత్రమే ప్రదర్శించడం వల్ల దీనిని పగటివేషంగా పిలుస్తున్నాము. జానపద కళారూపాలలో ఇది ఒక ప్రత్యేక కళ అని చెప్పవచ్చు. వీధినాటకాలు కాలక్రమేణా 'పగటివేషాలు'గా పరిణామం చెందాయని సాంస్కృతిక పరిశోధకుల అభిప్రాయం. ఈ కళను ప్రదర్శించేవారు ఊరూరా తిరుగుతు ప్రదర్శనలిస్తూ వెళ్తుంటారు. వీరినే సంచారి పగటి వేషగాళ్ళు అని అంటారు.

వీరికి మరోపేరు బహురూపులు. కళాప్రదర్శన చివర దాతల నుండి సంభావన తీసుకొని వాటిని బృంద సభ్యులు పంచుకోవడం ఆనవాయితి. వీరు తమ ప్రదర్శనలో భాగంగా అనేక వేషాలు వేస్తారు. అయితే వాటిలో ప్రత్యేకమైనది అర్థనారీశ్వర వేషం. ఒకే వ్యక్తి స్త్రీ, పురుష వేషాలు ధరించి పద్యాలు, సంభాషణలు చెప్పడం అద్భుతంగా కనిపిస్తుంది. ప్రారంభంలో యాచక వృత్తిగా ప్రారంభమైన ఈ కళ కాలక్రమంలో ఒక సంక్లిష్ట రూపంగా మారింది. మార్గ, దేశి, శిష్ట సాహిత్య లక్షణాలు మూర్తిభవించిన ఈ కళకు ఆధారాలు హాలుని గాధాసప్త శతిలోను మనకు కనబడుతున్నాయి. పగటి వేషాల లక్ష్యం వ్యంగ్యమే. వీరికి ప్రత్యేకంగా రంగస్థలమంటు లేదు. ప్రతి ఇంటిగడప వారికి ఒక రంగస్థలమే అని చెప్పవచ్చు.

**10) తప్పెట గుళ్ళు:** ఇది శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం ప్రాంతాలలో యాదవ కులానికి చెందినవారు చేసే నృత్య ప్రదర్శన. రొమ్ముపై రేకు తప్పెటలు ధరించి వాటిని వాయిస్తు ముఖ్యంగా శ్రీకృష్ణుడి గాథలను గానం చేయడం వీరి ప్రత్యేకత.

**11) ఒగ్గుకథ:** శివుని ఢమరుకాన్ని పోలిన 'ఒగ్గు' అనే వాయిద్యం మ్రోగిస్తూ వివిధ పౌరాణిక అంశాలను లయబద్ధంగా పాడుతు ప్రార్ధించే ఈ కళ తెలంగాణ ప్రాంతంలో ఒక విశిష్ట కళారూపం అని చెప్పవచ్చు, మిద్దె రాములు, చుక్క సత్తయ్య లాంటి ఒగ్గుకళాకారులు ఈ కళను అంతర్జాతీయ స్థాయికి చేర్చారు. ఒగ్గుకథ బృందంలో దాదాపు ఐదు నుండి ఆరుగురు ఉంటు ఒగ్గుతోపాటు ఇతర వాయిద్యాలను వాయిస్తు కథను ఆసక్తికరంగా చెప్పడం ద్వారా శ్రోతలు, వీక్షకులను ఆకట్టుకొంటారు. కథకుడు తలకు రుమాలు చుట్టుకొని, కాళ్ళకు గజ్జెలు కట్టుకొని కథ చెబుతుంటే మిగిలిన వారు వంతపాడుతారు.

**12) శారద కథలు:** తెలంగాణ ప్రాంతంలో తంబురా (శారద)ను భుజంపై మోసుకొని దానిని వాయిస్తు ఇంటింటికి తిరుగుతూ భిక్షను స్వీకరించే ఈ కళారూపం నేడు క్రమేణా అంతరించిపోతుంది. శారదను వాయిద్యంగా ఉపయోగించడం వల్ల వీరిని "శారదకాండ్రు" అంటారు. చేతిలో అందెలు మ్రోగిస్తూ, బాలనాగమ్మ, సర్వాయి పాపన్న, బొబ్బిలియుద్ధం మొదలగు చారిత్రక, పౌరాణికాంశాలను ఆశువుగా చెప్పుతు గ్రామ, గ్రామాన తిరుగుతు ప్రదర్శనలిస్తుంటారు. ఈ కళను ప్రదర్శించే జట్టులో పురుషుడు ప్రధాన కథకుడిగా ఉంటు అతని భార్యలు వంతపాడుతుంటారు.

**13) గొల్లసుద్దులు:** అయ్యల రాజు నారాయణామాత్యుడు రచించిన హంసవింశతిలో ఈ కళారూపం ప్రస్థావించబడింది. గొల్లసుద్దులు ప్రదర్శించే వారు ప్రధానంగా గొల్లవారిని యాచిస్తారు యాదవ చరిత్రకు సంబంధించిన కృష్ణలీలలు, కాటమరాజు కథ మొదలైన వాటిని ప్రదర్శిస్తారు. పెద్ద పెద్ద వస్త్రాలపై ఈ కథలను చిత్రించి వీటి సహాయంతో కథ చెప్పడం జరుగుతుంది. నేటికాలంలో గొల్లవారే కాకుండా ఇతర కులాలవారు సైతం ఈ కళను ప్రదర్శిస్తున్నారు. చేతిలో ఒక కర్రను ధరించి, భుజంపై గొంగడి వేసుకొని సమాజంలోని అన్యాయాలను వ్యంగ్యంగా ఎత్తిచూపుతు ప్రదర్శనలు ఇస్తున్నారు. తెలంగాణ సాయుధ పోరాటకాలంలో సుద్దాల హనుమంతు ఈ కళారూపం ద్వారా ప్రజలను ఎంతో చైతన్యం చేయడం జరిగింది.

**14) గారడి ప్రదర్శన:** ఈ విద్యను ప్రదర్శించే వారిని ఇంద్రజాలికులు అంటారు. ఇంద్రజాల విద్య ప్రదర్శనలో భాగంగా వీరు రకరకాల వింతలు, మాయలు ప్రదర్శిస్తూ వీక్షకులను సంభ్రమాశ్చర్యాలలో ముంచెత్తుతారు. పాల్కురికి సోమనాథుడు రచించిన పండితారాధ్య చరిత్రలో దీని ప్రస్తావన కనిపిస్తుంది. అరచేతిలో రూపాయి సృష్టించడం, వేపాకులను తేళ్ళుగా మార్చడం, బుట్టలోని మనిషిని మాయం చేయడం మనం ఇందులో గమనించవచ్చు.

**15) గంగిరెద్దులవారు:** ప్రాచీన కాలం నుండి వంశపారంపర్యంగా వస్తున్న జానపద కళారూపాల్లో గంగిరెద్దుల ప్రదర్శన ఒకటి. అయ్యగారికి దణ్ణం పెట్టు అంటు ఉదయాన్నే ఇంటిముందుకు గంగిరెద్దుతో వచ్చే వీరు గంగిరెద్దు ద్వారా వివిధ విన్యాసాలను ప్రదర్శిస్తారు.

ఈ విధంగా విశ్లేషించుకుంటు వెళితే భారతదేశంలో ఎన్నో విభిన్న సాంస్కృతిక కళారూపాలు మనకు కన్పిస్తాయి. ఇవి మచ్చుకు కొన్ని మాత్రమే. విభిన్న రాష్ట్రాలలో ఆయా ప్రజల సంస్కృతిని ప్రతిబింబించే మరెన్నో కళారూపాలు దర్శనమిస్తాయి. ఈ కళాప్రదర్శనలు జాతి జీవనాడులను, నాగరికత వికాసాన్ని, సాంస్కృతిక పరిణామాన్ని కళ్ళకు కట్టినట్లు చూపిస్తాయి.

---

Lecturer (Guide)

PRINCIPAL (FAC)
Govt. Degree College
Kaghaznagar-504296
Dist:Kumuram Bheem Asifabad